రోడ్డుపైనే పంట కుప్పలు

- పొంచి ఉన్న ప్రమాదాల ముప్పు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


చింతల్‌చాంద సమీపంలో రోడ్డుపై కంకులు


చామన్‌పెల్లి సమీపంలో రోడ్డుపై పోసిన మక్క కంకులు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చింది. దీంతో రైతులు కంకులను రోడ్లపై పోసి ఆరబెడుతున్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్లపై పోసిన కంకుల కుప్పలు కన్పించకపోవడంతో పలువురు వాహనదారులు రాత్రివేళ, తెల్లవారుజామున అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పంట కుప్పలు పోయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

గతేడాది జరిగిన ప్రమాదాలివీ.

- లక్ష్మణచాందకు చెందిన రాములు అనే వ్యక్తి పని నిమిత్తం బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా.. పొట్టపెల్లి(కే) గ్రామ సమీపంలో రోడ్డుపై పోసిన కంకులు కన్పించక కిందపడ్డారు. దీంతో తీవ్రగాయాలతోఆసుపత్రి పాలయ్యాడు.
- లక్ష్మణచాందకు చెందిన ముక్తార్ అనే యువకుడు గతంలో బైక్‌పై వెళ్తూ మండల కేంద్రం సమీపంలో రోడ్డుపై పోసిన కంకుల కుప్పపై పడి తీవ్ర గాయాలతో మృతిచెందాడు.
- మండలంలోని చామన్‌పెల్లి సమీపంలో నిర్మల్‌కు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.
- మండలంలోని రాచాపూర్-పొట్టపెల్లి గ్రామాల నడుమ రోడ్డుపై పోసిన మక్కలపైకి బైక్ వెళ్లడంతో రాచాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

రెండు మార్గాల్లో..

- రాచాపూర్ నుంచి చింతలచాంద వెళ్లే మార్గంలో రాచాపూర్, పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, చింతల్‌చాంద వరకు డబుల్ రోడ్డుపై రైతులు కంకుల కుప్పలు పోస్తున్నారు.
- రాచాపూర్ నుంచి పార్‌పెల్లి వెళ్లే మార్గంలో


రాచాపూర్ సమీపంలో కంకులపై కప్పిన టార్పాలిన్

రాచాపూర్, పీచర, ధర్మారం, పార్‌పెల్లి వరకు డబుల్ రోడ్డుపై కంకులు ఆరబెడుతుండటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రైతులు ప్రధాన రోడ్లపై మొక్కజొన్న కంకులు ఆరబెట్టడంతోపాటు రాత్రి టార్పాలిన్లు కప్పి చుట్టూ రాళ్లు పెడుతున్నారు. దీంతో రాత్రి వాహనదారులకు టార్పాలిన్లు కనిపించక ధాన్యం కుప్పలపైకి బైకులతో వెళ్లి కింద పడుతున్నారు. పంటకుప్పలపై రాళ్లు ఉండటంతో తీవ్రంగా గాయపడుతున్నారు.

అదుపుతప్పి కింద పడుతున్నాం



అన్నదాతలు రోడ్లపై పోసిన కంకుల కుప్పలపై టార్పాలిన్లు కప్పి, రాళ్లు పెట్టడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు. – శివన్న, న్యూకంజర్

చర్యలు చేపట్టాలి



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్లపైనే కంకుల కుప్పలు పోస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు కిందపడుతున్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి. – రవీందర్, లక్ష్మణచాంద

ఇబ్బందులు కలగకుండా చూస్తాం

రోడ్లపై కంకులు పోయవద్దని రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో మండలంలోని అన్ని గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది కల్గకుండా.. బ్యానర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. – అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

క్లుప్తంగా

అల్లంపల్లి యువకుడి ప్రతిభ


సింగిరెడ్డి రాజు

కడెం: మండలంలోని అల్లంపల్లికి చెందిన సింగిరెడ్డి రాజు సింగరేణి ఉద్యోగ పరీక్షలో ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 20న వెలువడిన మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్) ఫలితాల మెరిట్ జాబితాలో రెండోస్థానంలో నిలిచాడు. స్థానిక జీయర్ గురుకులంలో ఏడో తరగతి వరకు చదివాడు. తండ్రి మరణానంతరం తల్లి, సోదరుల ప్రోత్సాహంతో ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు, జీయర్ గురుకులం ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అనాథకు అంత్యక్రియలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కన భిక్షాటన చేసుకునే ఓ అనాథ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలిసి పట్టణానికి చెందిన హెల్పింగ్ హాండ్స్, హ్యాపీ ఫేసెస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

ఆరె మరాఠా సంఘు కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం

కుంటాల: మండలంలోని పాతవెంకూర్ గ్రామంలో ఆదివారం ఆరె మరాఠా సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సిందె సాయినాథ్, గౌరవ అధ్యక్షుడిగా వీర్పాపాటిల్, ఉపాధ్యక్షుడిగా గోపాల్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా మోరేకర్ మనోహర్ పటేల్, జాయింట్ సెక్రెటరీగా గణేశ్‌పటేల్, కోశాధికారిగా గోపాల్‌పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

తప్పిన ప్రమాదం


వాహనం పరిశీలిస్తున్న పోలీసులు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ సమీపంలో ఆదివారం 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి కంటైనర్ బోల్తా పడింది. నాగాపూర్ నుంచి తమిళనాడులోని మధురైకి వెళ్తుండగా మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని డ్రైవర్ తెలిపాడు. పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం పత్తి పంటకు జీవం పోయగా.. కోతకు వచ్చిన సోయా పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోయారు. మండలంలో 3.7 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన టీఎన్జీవోస్ సంఘు సభ్యులు


కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఎమ్మెల్సీ కోదండరాంను టీఎన్జీవో సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కుడాల రవికుమార్ ఉన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు ఇస్తున్న వికాస్ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా కేంద్రంలోని వశిష్ట ఇంపల్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల చైర్మన్ శ్రీ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ ముచ్చింతల్‌లోని శ్రీ శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమంలో ప్రజ్ఞావికాస్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో మలిహా తస్కీన్(పదోతరగతి), చిత్రలేఖనంలో సాత్విక (తొమ్మిదో తరగతి) ప్రథమస్థానంలో నిలిచారు. విద్యార్థులకు ప్రశంసాపత్రం, రూ.మూడు వేల బహుమతి అందజేశారు. వారిని చైర్మన్, ప్రిన్సిపాల్ మాధవి, దేవిదాస్ తదితరులు అభినందించారు.

మందుల కోసం తప్పనిపాట్లు

- భైంసా ఏరియాస్పత్రిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఇరుకుగదిలో ఇబ్బందులు పడుతున్న జనం

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మందులు తీసుకునే గది ఇదివరకు ఆస్పత్రి ఆవరణలో ఉండగా.. ప్రస్తుతం ఆస్పత్రి భవనంలోని లోపలి గదిలోకి మార్చారు. దీంతో అసలే గది ఇరుకుగా ఉండడం, రోగులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవలి వర్షాలకు ఆవరణలో రోగులు ఇబ్బందులు పడకుండా మందులు ఇచ్చే గదిని లోనికి మార్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అధికారుల నిర్ణయం మంచిదే అయినా.. విశాలమైన గదిలోకి మార్చి ఇబ్బందులు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

కెమెరాక్లబ్ యూనియన్ కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయ సమీపంలో నిర్మల్ పట్టణ కెమెరాక్లబ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు అయిట్ల ప్రవీణ్‌కుమార్, రామ్‌రమేశ్, ఉత్తూర్‌వార్ పోశెట్టి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నిర్మల్ పట్టణ అధ్యక్షుడిగా మంత్రి సుమన్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల శ్రీకాంత్, కోశాధికారిగా మారుతి కిరణ్, ఉపాధ్యక్షుడిగా పడిగేల నర్సయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపకోశాధికారిగా వినీత్ ఉత్తూర్‌వార్, సలహా కమిటీ సభ్యులుగా కప్పకంటి సురేశ్, బెజ్జారం విష్ణుచారి, కే.సాయందర్, పి.రాజు, విలాస్, వెంకటేశ్వరరాజు, ప్రచార కార్యదర్శులుగా ప్రవీణ్ ముజిగి, అల్లాడి రాజు, నిమ్మతోట రాజు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

బాధిత కుటుంబాలకు సాయం


నర్సాపూర్(జి): చెక్కు అందిస్తున్న సుదర్శన్

నర్సాపూర్(జి): రోడ్డు ప్రమాద బాధితులకు ఆదివారం రూ.20 వేలు అందించి అండగా నిలిచారు సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్. మండలంలోని బామ్ని(బి) గ్రామానికి చెందిన ముదోళ్ల చిన్న ముత్యం-లక్ష్మి దంపతులు గతంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున సమత ఫౌండేషన్ వారు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సాహెబ్‌రావు, పీఆర్‌ఓ క్రాంతి, సీఈఓ అనిల్, నాయకులు దేవోళ్ల పోశెట్టి, దేవేందర్, రవి, ప్రభాకర్, ముత్యం, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పట్టణంలో..

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ ఎస్సీ కాలనీలో నివాసముండే విజయలక్ష్మి-రాజ్‌కుమార్ దంపతుల కుమార్తె(18 నెలలు) హైడ్రోసిఫాలస్ వ్యాధితో బాధపడుతోంది. ఈవిషయం తెలిసి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్.. చిన్నారి వైద్యఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ.5వేలను స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో రాజగంగన్న, కలీల్, గజేందర్, ప్రదీప్, సుమన్, దివాకర్, సుమిత్, అజయ్ తదితరులు ఉన్నారు.

'నిర్మాణానికి అడ్డంకులు తొలగించండి'


చైర్మన్ ఈశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నిర్మించే అంబేద్కర్ భవన నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్ పనులను కొందరు అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. 30ఏళ్లుగా ఆ స్థలంలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నామని.. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేశ్, రాజలింగం పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

భైంసాటౌన్: పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారని పలువురు కాలనీవాసులు వాపోయారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'అపరిశుభ్రత పట్టించుకోని కమిషనర్'అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీనగర్‌కు చెందిన చంద్రే ప్రీతి అనే యువతి డెంగీ లక్షణాలతో మృతి చెందిందన్నారు. శాస్త్రీనగర్‌లో మరో రెండు డెంగీ కేసులు నమోదు కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు కాంబ్లే సాహెబ్ రావు, అంకిత్ వాగ్మారే, జంగ్మే సంతోష్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ముమ్మరం చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి


లోకేశ్వరంలో మాట్లాడుతున్న అంజుకుమార్‌రెడ్డి

ముథోల్: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముథోల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు ఈనెల 25 వరకు గడువు ఉందని.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్, సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగర్ నారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు పోతన్న, ఆర్.గంగాధర్, సుస్మితారెడ్డి, బీజేపీ నాయకులు సతీశ్‌రెడ్డి, సుదర్శన్, రఘునాథ్, గంగాధర్, రవికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేశ్వరం: కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి.. బీజేపీ సభ్యత్వ నమోదు చేయించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 25న పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పుస్కరించుకుని ప్రతి బూత్‌లో 200 మందిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్, పైడిపల్లి గంగాధర్, సామ రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సుమన్, అనసూయ, తోకల సరస్వతి, చిన్నారావు, జయసాగర్‌రావు, శ్రీధర్, సాయన్న, సాహెందర్, అనిల్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

'బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి'


మాట్లాడుతున్న గజేందర్ యాదవ్

నిర్మల్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కులగుణన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని కోరారు. ఈనెల 30న ఆర్డీవో కార్యాలయం ఎదుట నవ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మెరుగు మధుకర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా గొం౦డ్ర నవీన్‌కుమార్, కార్యదర్శిగా మహేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గంగిరెడ్డి నర్సారెడ్డి, అధికార ప్రతినిధిగా ఎర్రబోతు లింగన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు.

మారథాన్‌లో పాల్గొన్న సోన్ ఎస్సై

సోన్: కరీంనగర్‌లో సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మారథన్ పోటీలో సోన్ ఎస్సై కే.గోపి పాల్గొని సత్తా చాటారు. 21 కిలోమీటర్ల పరుగు పూర్తి చేసి మెడల్ సాధించారు.

భోసిలో ఉచిత వైద్య శిబిరం

తానూరు: మండలంలోని భోసిలో నిజామాబాద్ దేవి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ సాయితేజరెడ్డి, వైద్యసిబ్బంది, నిర్వాహకులు దుర్గప్రసాద్, మారుగొండ మధు తదితరులు న్నారు.

జీవన విధానంలో 'సహకారం' భాగం


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రాచీన కాలం నుంచి భారతీయుల జీవన విధానంలో సహకారం భాగమని శ్రీరామ సహకార సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు అగ్గనూరు వెంకటరెడ్డి అన్నారు. లోకమాన్య పరస్పర సహాయక పొదుపు, పరపతి సహకార సంఘం లిమిటెడ్ జిల్లా మొదటి వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్మల్‌లోని విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. సంస్కారం లేకుండా సహకారం లేదని.. సహకారం లేకుండా అభివృద్ధి లేదన్నారు. సహకార సంఘాల ద్వారా పేద, మధ్యతరగతి, ధనిక వర్గాల వారికి పొదుపు అలవడుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ నిమ్మల ప్రతాప్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాకార్యవాహ రాజులవార్ దిగంబర్, లోకమాన్య అధ్యక్షుడు భూసారపు గంగాధర్, కమిటీ సభ్యులు నూకల విజయ్‌కుమార్, నార్లపురం రవీందర్, మంచిరాల నాగభూషణం, సహకార భారతి జిల్లా మహిళా ప్రముఖ్ పాంపట్‌వార్ అనురాధ, తాళ్ల సుదర్శన్, బాబాపూర్ గోవిందరావు, రాజారపు శ్రీనివాస్, ఆడెపు లలిత, మంచిర్యాల వినితరాణి, జద్వని, వసంత్ పటేల్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

లోకమాన్య సహకార సంఘం జిల్లా పాలకవరాన్ని ఎన్నికల అధికారి తొడిశెట్టి పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా భూసారపు గంగాధర్, వైస్ చైర్మన్‌గా శివరాం వెంకటేశ్, జనరల్ సెక్రెటరీగా మహాజన్ సతీశ్, జాయింట్ సెక్రెటరీగా మైసర్ల వెంకటరమణ, క్యాషియర్‌గా నల్ల పురుషోత్తంరెడ్డి, జాయింట్ క్యాషియర్‌గా జటల శ్రీనివాస్, డైరెక్టర్లుగా కాస శ్రీనివాస్, నాలం మదన్‌మోహన్, రాపర్తి అనూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

23ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం


2000-01 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని డీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాలులో ఆదివారం లక్ష్మణచాంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనుపమ, సుభాశ్, వెంకటరమణ, పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందించిన మాజీ ఎమ్మెల్యే


ప్రొసీడింగ్ అందిస్తున్న నారాయణరావు పటేల్

కుంటాల: అన్నిరంగాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్ పేర్కొన్నారు. కుంటాల గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో రీడింగ్ రూమ్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కుంటాల ఉన్నత పాఠశాల అంబకంటి రోడ్డు నుంచి గజ్జలమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.25 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయగా.. అందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని ఆదివారం భైంసాలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్, వెంకటేశ్, పోశెట్టి, గజ్జారాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి


ఇళ్లకు నీటిని తీసుకెళ్తున్న ప్రజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నాగానాయిపేట్ డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో స్నానం, ఇతర కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండంతస్తుల భవనంపైకి కింది నుంచి నీటిని మోసుకెళ్తున్నామని వాపోయారు. ఈ కాలనీలో సుమారు 200 కుటుంబాలు ఉంటాయి. మున్సిపల్ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. లేకుంటే కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు.